


శుక్రవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కెటిఆర్

# రైతులు మళ్లీ కొత్తగా ఎందుకు ప్రమాణపత్రాలు ఇవ్వాలి?

## సర్కార్‌ను ప్రశ్నించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 3:** ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులు కాకుండా.. రైతులు మళ్లీ కొత్తగా ఎందుకు ప్రమాణ పత్రాలు ఇవ్వాలి..? అని రేవంత్ రెడ్డి సర్కార్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రైతులు కాదు ప్రమాణపత్రాలు ఇవ్వాల్సింది.. రేవంత్ రెడ్డి ఇవ్వాలి అని కేటీఆర్ సూచించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఎన్నికల మేనిఫెస్టోలో కూడా హామీలు ఇచ్చారు. ఎన్నికలప్పుడేమో కాంగ్రెస్ నేతలు బాండ్ పేపర్లు రాసిచ్చారు. ఇప్పుడేమో రైతులు ఊర్లలో ప్రమాణపత్రం ఇవ్వాలట. ఇంతకంటే విచిత్రమైన ముచ్చట వినలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన అని కింద అన్ని వర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల కోసం కోటి 6 లక్షల మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. మరి ఈ సమాచారం ప్రభుత్వం దగ్గర ఉండాలి కదా..? ఇప్పుడేందుకు కొత్తగా రైతులను ప్రమాణపత్రాలు అడుగుతున్నారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన అన్నారు. మొన్నటి దాకా కుల గణన, ఇప్పుడ మళ్లా కొత్తగా ప్రమాణ పత్రం ఇవ్వాలని అంటున్నారు. ప్రమాణపత్రం ఇస్తేనే రైతుభరోసా పైసలు ఇస్తాం అంటున్నారు. రైతును శాసించే స్థాయికి కేసీఆర్ తీసుకొచ్చారు. వీళ్లేమో రైతును యాచించే స్థాయికి తీసుకెళ్తున్నారు. రైతు భరోసా కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు ప్రభుత్వం. వానాకాలం పంట పెట్టుబడి ఎగ్గొట్టారు. వదిలిపెట్టం. దాన్ని జమ చేసే వరకు పోరాడుతాం. ఈ ప్రభుత్వాన్ని అడుగుతున్నా ప్రమాణపత్రం ఎవ్వరివ్వాలి.. నీవు, నీ ప్రభుత్వం ప్రమాణపత్రం ఇవ్వాలి. ఏ ఊర్లో ఏ రైతుకు ఎంత రుణమాఫీ అయిందో దమ్ముంటే బయటపెట్టు. ప్రజలకు కూడా తెలుస్తది. ఈ ఊరిలో ఎంత మంది భూ యజమాలు, కౌలు రైతులు ఉన్నారో స్పష్టంగా చెప్పాలి. 70 లక్షల ఖాతాలు నీ దగ్గర ఉన్నాయి.. పొలం వివరాలు అన్నీ తెలుసు.. తెలిసీ కూడా ఈ ప్రయత్నం చేస్తున్నావంటే కటింగ్ పెట్టుందకు ప్లాన్ చేస్తున్నవ్ అని వ్యాఖ్యానించారు.

# 6న చర్లపల్లి టర్మినల్‌ను వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోడీ

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** భాగ్యనగర మణిహారంలో చర్లపల్లి టర్మినల్ మరొక మణిపూసగా చేరనుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈనెల 6న ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా వర్చువల్‌గా చర్లపల్లి టర్మినల్‌ను ప్రారంభించుకోనుండడం గర్వకారణమని అన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత్ అభివృద్ధే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పనలో దేశాన్ని పరుగులు పెట్టిస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ సారథ్యంలో దేశమంతా రైల్వేరంగం అభివృద్ధి చెందుతుందన్నారు. భారతదేశానికి స్వాంతంత్రం సిద్ధించిన తర్వాత తెలంగాణలోనే మొట్టమొదటి టర్మినల్‌గా చర్లపల్లి టర్మినల్ చరిత్రలో నిలిచిపోనుందని అన్నారు.

# సిఎంఆర్ కళాశాల ఘటనపై కొనసాగుతున్న విచారణ

## కళాశాలకు మూడురోజుల సెలవులు

## సుమోటోగా కేసు నమోదు చేసిన రాష్ట్ర మహిళా కమిషన్

**మేడ్చల్, జనవరి 3, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయలో గల సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నెలకొన్న ఘటనతో కళాశాల యాజమాన్యం మూడు రోజుల సెలవు ప్రకటించింది. కళాశాలలోని బాలికల హస్టల్ బాత్రూం గదిలో విడియోలు చిత్రీకరించారంటూ విద్యార్థినీలు ఆరోపిస్తూ రెండు రోజుల పాటు ఆందోళన చేసిన సంఘతి విదితమే. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారు. హస్టల్ వార్డెన్ ప్రీతితో సహ ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. వారి నుండి 12 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. నిందితుల వేలిముద్రలు సైతం సేకరించారు. బాత్రూంలో విడియోలు చిత్రీకరించారంటూ విద్యార్థినులు బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు కళాశాల ప్రాంగణంలో నిరసన చేపట్టారు. అమ్మాయిలకు ఏబీవీపీ, ఎన్ఎస్‌యుఐ, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాలు వారికి మద్దతు పలికి నిరసనలో పాల్గొన్నాయి. బీజెవైఎం నేతలు సైతం విద్యార్థినుల ఆందోళనకు మద్దతు పలిని నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని చేసిన ఆందోళనతో ఉత్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేయడంతో గురువారం రాత్రి వివాదం సద్దుమనిగింది. మరో వైపు ఈ అంశాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసింది. యాజమాన్యానికి నోటీసులు జారీ చేసింది. మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజా రమణ హస్టల్‌కు వచ్చి పరిశీలించి విద్యార్థినుల నుంచి సమాచారం సేకరించారు. కాగా బాలికల హస్టల్ వార్డెన్ ప్రీతిని సీఎంఆర్ కళాశాల యాజమాన్యం తొలగించింది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు.

# మీ నాయన ఫామ్‌హౌజ్ ముందు ధర్నా చెయ్

## కవితకు భువనగిరి ఎంపి చామల హితవు

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** బిసిల రిజర్వేషన్ పెంపు కోసం ఇందిరా పార్కులో కాదు మీ నాయన ఫామ్ హౌస్ ముందు ధర్నా చెయ్ అంటూ కల్వకుంట్ల కవితకు భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హితవు చెప్పారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో బీసీ కులగణ చేస్తుంది ఆయన వివరించారు. పదేళ్ల పాలనలో ధర్నా చౌక్ ని లేకుండా చేసి ఇప్పుడు లిక్కర్ స్కామ్‌లో పోయిన ప్రతిష్ఠను నిలుపుకోవడానికి అక్కడికి రావడం ఏంటని ఆయన ఎద్దేవా చేశారు. బీసీలను విస్మరించిన ఘనత బిఆర్ఎస్ పార్టీదిఅని కవిత గుర్తుపెట్టుకోవాలని ఆయన సూచించారు. మీరు పదేళ్ళలో బిసిలకు చెందిన అనేక సంక్షేమపథకాలు అటుకెక్కించి ఇప్పుడు ధర్నా చేయడం విడ్డురంగా ఉంది అని ఆయన అన్నారు. సావిత్రిభా పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన పనికూడా ఆమె ధర్నా ఖాతాలో వేసుకోవడం గర్హనీయం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసే బీసీ కులగనణ కూడా మేము ధర్నా చేయడం వలనే చేసిందని చెప్పుకోవడానికే ఎమ్మెల్సీ కవిత ఈరోజు ధర్నా కార్యక్రమం చేస్తున్నారు. గత పది సంవత్సరాలలో బీసీలను పట్టించుకున్న దాఖలాలు లేవుఅని అన్నారు. బిఆర్ఎస్ బిసిలను విస్మరించింది. హనుమంతరావు, కేశవరావు, డి శ్రీనివాస్ ప్రస్తుతం మహేష్ కుమార్ గౌడ్ లాంటి బీసీలకు పెద్ద పీట వేసి పీసీసీ అధ్యక్షులను చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని ఆయన గతంను గుర్తుచేశారు. మీకు బిసిల పట్ల చిత్త శుద్ధి ఉంటే మీ పార్టీ అధ్యక్షునిగా బిసిలను ప్రకటించండి అని సూచించారు. రాహుల్ గాంధీ అయినా రేవంత్ రెడ్డిదైనా కాంగ్రెస్ పార్టీది ఒకటే నిర్ణయం ఉంటుంది వీలైతే మీరు కూడా కులగనణ లో భాగస్వాములై సహకరించండి. కానీ ప్రజలను తప్పుదోవ పట్టించకండి, మీకు ధర్నా చేసే అధికారం లేదని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

# టిజిఎస్‌పిలో బాక్సింగ్, క్రికెట్ కోచింగ్ సెంటర్ల ఏర్పాటు

## డిజిపి జితేందర్ వెల్లడి

## స్పెషల్ పోలీసు కానిస్టేబుళ్ల దీక్షాంత్ పెరేడ్‌లో ముఖ్యఅతిథిగా హాజరు

## డిఎస్‌పి హోదాలో పెరేడ్‌లో పాల్గొన్న ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రత్యేక పోలీసు విభాగం (టిజిఎస్‌పి)లో రాబోయే రోజుల్లో క్రికెట్, బాక్సింగ్ కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసేందుకు కృషి చేస్తామని డిజిపి జితేందర్ అన్నారు. యూసుఫ్‌గూడలోని టిజిఎస్‌పి ఒకటో బెటాలియన్‌లో శుక్రవారం ఉదయం జరిగిన కానిస్టేబుళ్ల దీక్షాంత్ పెరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ మహిళా బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్, టీమిండియా క్రికెటర్ సిరాజుద్దీన్‌లో టిజిఎస్‌పిలో డిఎస్‌పిలుగా ప్రభుత్వం నియమించిందని, వీరిద్దరు అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు ఎన్నో విజయాలను అందించారని తెలిపారు. వీరిద్దరు మంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారులని డిజిపి కితాబునిచ్చారు. వీరిద్దరి ఆధ్వర్యంలో టిజిఎస్‌పిలో క్రికెట్, బాక్సింగ్ కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కోచింగ్ కేంద్రాల నుంచి అనేకమంది అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేస్తామని డిజిపి చెప్పారు. నిఖత్ జరీన్, సిరాజుద్దీన్‌లు తమ క్రీడా నైపుణ్యంతో తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టారని డిజిపి కొనియాడారు. టిజిఎస్‌పిలో గతంలో ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు వుండేవారని ఆయన అన్నారు. టిజిఎస్‌పి విభాగం శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసు విభాగానికి సహాయ సహకారా లు అందిస్తోందని డిజిపి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం 4,077 మంది టిజిఎస్‌పి కానిస్టేబుళ్లు ఆయా బెటాలి యన్లలో దీక్షాంత్ పెరేడ్‌లో పాల్గొన్నారని డిజిపి తెలిపారు. ఇందులో యూసుఫ్‌గూడ బెటాలియన్‌లో 548 మంది కానిస్టేబుళ్లు పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్నారని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో ఒకేసారి 4077 మంది టిజిఎస్‌పి జవాన్లు శిక్షణ పొందడం ఇదే తొలిసారిగా డిజిపి తెలిపారు. ఇందుకోసం ఈ విభాగం పక్కా ప్రణాళికతో వ్యవహరించి శిక్షణను విజయవంతం అయ్యేలా కృషి చేసిందని డిజిపి అభినందించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టిజిఎస్‌పి అదనపు డిజి సంజయ్ కుమార్‌జైన్ మాట్లాడుతూ టిజిఎస్‌పి అంటే క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన విభాగమని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో యూసుఫ్ గూడ బెటాలియన్ కమాండంట్‌తో పాటు టిజిఎస్‌పిలో డిఎస్‌పిగా చేరిన మహిళా బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్ తదితరులు పాల్గొన్నారు.

### బెటాలియన్లలో ఘనంగా దీక్షాంత్ పెరేడ్

ఇదిలావుండగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా టిజిఎస్‌పి బెటాలియన్లలో దీక్షాంత్ పెరేడ్ ఘనంగా జరిగింది. ఇబ్రహీంపట్నంలోని మూడో బెటాలియన్‌లో జరిగిన పెరేడ్‌కు నిఘావిభాగం డిజి శివధర్‌రెడ్డి, నాలుగో బెటాలియన్‌లో పెరేడ్‌కు ఎసిడి డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి, ఏడవ బెటాలియన్‌లో పెరేడ్‌కు నిజామాబాద్ ఇన్‌ఛార్జి కమిషనర్ సింధూశర్మ, పోలీసు అకాడమిలో పరేడ్‌కు అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్, పదవ బెటాలియన్‌లో పెరేడ్‌కు ఐజి సత్యనారాయణ, 12వ బెటాలియన్‌లో పెరేడ్‌కు ఐజి రమేష్, 13వ బెటాలియన్‌లో పెరేడ్‌కు మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్, 15వ బెటాలియన్‌లో పెరేడ్‌కు ఖమ్మం సిపి సునీల్‌దత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.




యూసుఫ్‌గూడలోని టిజిఎస్‌పి ఒకటో బెటాలియన్‌లో శుక్రవారం జరిగిన కానిస్టేబుళ్ల దీక్షాంత్ పెరేడ్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న డిజిపి జితేందర్

### సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిఖత్ జరీన్

కాగా యూసుఫ్‌గూడలో జరిగిన టిజిఎస్‌పి కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్‌కు మహిళా బాక్సింగ్ ఛాంపియన్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన నిఖత్ జరీన్ పోలీ సు శాఖలో డిఎస్‌పిగా చేరడం ద్వారా తన గౌరవం మరింత పెరిగిందని అన్నారు. పోలీసు శాఖలో కానిస్టేబుళ్లుగా చేరిన వారికి బాక్సింగ్‌లో శిక్షణ ఇవ్వాలని డిజిని తనను కోరారని, ఇందుకు తాను సంసిద్ధం వ్యక్తం చేశానని ఆయన తెలిపారు.

# అద్భుత ఆవిష్కరణలకు చిరునామా ఐఐటి హైదరాబాద్

## ఇది కలల కర్మాగారం: డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క




సమావేశంలో ప్రసంగిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 3, ప్రభాతవార్త :** ఐఐటీలు కేవలం విద్యాసంస్థలు మాత్రమే కాదు.. దేశ నిర్మాణానికి వేదికలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సంగారెడ్డి సమీపంలోని ఐఐటి హైదరాబాద్‌లో నిర్వహించిన హైదరాబాద్, ఆస్ట్రేలియా, ఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్ వర్క్ షాప్‌లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఐఐటి హైదరాబాద్‌లో ఇప్పటివరకు 11,500 పరిశోధన ప్రచురణలు, 320 పైగా పేటెంట్లు, స్టార్టప్‌ల ద్వారా 1500 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడం గొప్ప మార్పు అని కొనియాడారు. ఆస్ట్రేలియా, ఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్ కింద మోనాష్ యూనివర్సిటీ సహకారంతో చేపట్టిన కార్యక్రమాలు కేవలం తెలంగాణ, భారతదేశానికే కాదు, ప్రపంచానికే కీలకమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని రూపొందించడంలో ఈ వర్క్ షాప్ సహకార స్ఫూర్తికి అద్దం పడుతుందని అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, పేదరికం, అసమానతలపై పోరాడడానికి అవసరమైన సాధనాలుగా ఐఐటిలను నెహ్రూ అభివర్ణించారని అన్నారు. ఐఐటి హైదరాబాద్‌కు నాటి సీఎం దివంగత నేత వైయస్. రాజశేఖర్ రెడ్డి కీలకపాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణలో క్లిష్టమైన ఖనిజాలను వెలికి తీసేందుకు సమర్థవంతమైన మార్గాలు కనుగొనడం, స్థిరమైన మైనింగ్ పద్ధతులు అవసరమని అన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ పరిశోధన, వాటి సంబంధిత సైన్స్ ఆధార కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జిని ఉత్పత్తి చేయబోతున్నామని అన్నారు. ఆవిష్కరణల ప్రోత్సాహానికి, సుస్థిరతకు తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని అన్నారు. గ్రీన్ ఎనర్జీ, స్థిరమైన టెక్నాలజీ, శాస్త్రీయ ఆవిష్కరణలలో దేశంలో మొదటి స్థానంలో నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని అన్నారు.

# ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు బాధ్యతల స్వీకారం



**భువనేశ్వర్, జనవరి 3:** ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరి బాబు శుక్రవారం ప్రమాణం చేసారు. ఒడిశా హై కోర్టు ప్రధాన న్యాయ మూర్తి చక్రధారి శరణ్ సింగ్ ప్రమాణం చేయించారు. భువ నేశ్వర్‌లోని రాజ్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సిఎం మోహన్‌చరణ్ మాజీ సీఎం మాజీ నవీన్ పట్నాయక్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఇతర బిజెపి నాయకులు పలువురు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కంభంపాటి హరిబాబు 2021 జులైలో తొలిసారి మిజోరమ్ గవర్నర్‌గా నియమితులైన సంగతి తెలిసిందే. ఒడిశా గవర్నర్ రఘుబర్‌దాస్ రాజీనామాతో ఆయన స్థానంలో కంభంపాటి హరిబాబునను కేంద్రం నియమించింది. మిజోరమ్ గవర్నర్‌గా విజయ వంతంగా బాధ్యతలు నిర్వర్తించడంతో కేంద్రం ఆయన సేవలను ఒడిశాకు వినియోగించాలని నిర్ణయించింది. అందువల్లనే అక్కడ గవర్నర్‌గా ఉన్నదాస్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి మళ్లీ రావాలన్న సంకల్పంతో ఉన్నందున ఆయన రాజీనామాను వెంటనే ఆమోదించిన కేంద్రం జాప్యం లేకుండా ఒడిశాకు మరో గవర్నర్ అనుభవజ్ఞుడు విద్యావేత్త అయిన కంభంపాటి హరిబాబును నియమించింది.

# త్వరలో ఎఐ సిటీకి శంకుస్థాపన

## క్వాంటం కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

## తెలంగాణలో బ్లాక్‌చెయిన్ సిటీ

## ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** తెలంగాణలో బ్లాక్ చైన్ సిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఎక్కడ, ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలనే అంశంపై ఇప్పటికే సంబంధిత పరిశ్రమలు, నిపుణులతో సంప్రదింపులు ప్రారంభించామన్నారు. శుక్రవారం మాదాపూర్‌లో డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్ రంగంలో సుమారు 1800 మందికి ఉపాధి కల్పిస్తున్న సెంటిలియన్ నెట్ వర్క్స్ అండ్ హెచ్ సి రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన క్యాంపస్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కొత్త సాంకేతికల ఆవిష్కరణలో తెలంగాణను నంబర్ వన్‌గా నిలిచేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. ఆయా రంగాల్లో తెలంగాణ యువతకు స్కిల్స్ యూనివర్సిటీ, పరిశ్రమల సహకారంతో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నా. ఫ్యూచర్‌సిటీలో నిర్మించ తలపెట్టిన ఏఐ యూనివర్సిటీకి త్వరలో శంఖుస్థాపన చేయబోతున్నాం. ప్రత్యేకంగా క్వాంటం కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించబోతున్నాం అని వివరించారు. దేశంలో ఫ్రాంటియర్ టెక్నాలజీ హబ్‌ను ఏర్పాటు చేసే యోచనలో కేంద్రం ఉంది. ఆ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలంటూ ఇప్పటికే కేంద్రాన్ని కోరాం. ఇక్కడి అనుకూలతలను ప్రత్యేకంగా వివరించాం. ఈ విషయంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నామని అన్నారు. పౌర సేవలను చివరి వ్యక్తి వరకు సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఏఐ, బ్లాక్ చెయిన్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను విరివిగా వినియోగించుకోబోతున్నాం. ఇటీవలి కాలంలో కీలకంగా మారిన డ్రోన్ టెక్నాలజీపై తెలంగాణ యువతకు ప్రత్యేకంగా శిక్షణనిచ్చి, వారికి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కసరత్తు చేస్తున్నాం అని వివరించారు.

# పట్టువిడుపులతో సమస్యలు పరిష్కరించుకోవాలి

## సిఆర్‌టిలకు మంత్రి సీతక్క సూచన

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** పట్టు విడుపులతో సమస్యలు పరిష్కరించుకోవాలని సిఆర్‌టిలకు మంత్రి సీతక్క సూచించారు. తెగే దాకా లాగొద్దని సిఆర్‌టిలతో జరిగిన చర్చలో సున్నితంగా హెచ్చరించారు. మంత్రి సీతక్క విజ్ఞప్తి మేరకు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. తాము శనివారం నుంచి విధుల్లో చేరుతున్నట్లుగా ప్రకటించారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ, మినిమం టైం స్కేల్ మినహా అన్ని డిమాండ్లకు సానుకూలంగా ప్రభుత్వం స్పందించిందన్నారు. ప్రతినెలా ఐదో తేదిలోపు జీతాలు, మహిళా టీచర్లకు 180 రోజుల ప్రసూతి సెలవులు, డెత్ బెనిఫిట్స్ మంజూరు చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ, మినిమం టైం స్కేల్ డిమాండ్లపై ముఖ్యమంత్రి చర్చించి మరోసారి సమావేశం అవుదామని చెప్పిన మంత్రి వారికి సూచించారు. ఆది వాసి గిరిజన విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. పదేళ్లుగా మీ సమస్యలు పెండింగ్లో ఉన్నాయని, ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ వస్తున్నామని, సిఆర్‌టి సేవలను పొడగిస్తూ ఇప్పటికీ ముఖ్య మంత్రి ఫైల్‌పై సంతకం చేశారని గుర్తు చేశారు.

# తెలంగాణను క్రీడలకు హబ్‌గా మారుస్తాం

## తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మంత్రి శ్రీధర్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నిక

## అధికారికంగా ప్రకటించిన పుల్లెల గోపిచంద్

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడిగా రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు పుల్లెల గోపిచంద్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన మంత్రి శ్రీధర్ బాబును సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఒక క్రీడాకారుడిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణను క్రీడలకు హబ్‌గా మార్చాలని కంకణం కట్టుకున్నారన్నారు. దక్షిణ కొరియాలోని ఒక చిన్న స్పోర్ట్స్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన ప్యారిస్ ఒలింపిక్స్‌లో 37 పతకాలు సాధించారు. ఈ స్ఫూర్తితోనే తెలంగాణలోనూ స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించబోతున్నా అన్నారు. అకడమిక్స్, గేమ్స్‌ను మిళితం చేస్తూ విద్యార్థి వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దుతూ, ప్రతిభను వెలికితీసేందుకు స్పోర్ట్స్ పాలసీకి రూపకల్పన చేస్తున్నాం. ఈ ప్రక్రియలో విద్యావేత్తలు, ప్రముఖ క్రీడాకారులను భాగస్వామ్యం చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటాలన్నదే ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా అని వివరించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఆలిండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట (అండర్-19 ఇయర్స్)ను గచ్చిబౌలీలోని గోపిచంద్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు.

# 42శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలుచేయాలి

## బిసిలకు ద్రోహం చేసింది జాతీయ పార్టీలే

## ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జనవరి 3, ప్రభాతవార్త:** బీసీలకు ద్రోహం చేసింది జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలేనని ఎమ్మెల్సీ కవిత ధ్వజమెత్తారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని బీసీ రిజర్వేషన్ల సాధనకై ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై కవిత సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కామారెడ్డి బీసీ డిక్లరేసన్ వెంటనే అమలుచేయాలని, బీసీలకు 42 శాతం రిజర్వేన్ కల్పించాలని సంతకాల సేకరణ బ్యానర్‌పై సంతకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆనాడు కాంగ్రెస్ ప్రధాని నెహ్రూ కాకా కాలేల్కర్ కమీషన్ నివేదికను తిరస్కరించి బీసీలకు ద్రోహం చేస్తే, బీసీల కోసం పనిచేస్తున్న వి.పి.సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వకుండా బీజేపీ ద్రోహం చేసిందని ఆరోపించారు. బీసీలకు అన్యాయం చేసింది జాతీయ పార్టీలేనని, బీసీలకు న్యాయం చేసింది మాత్రం ప్రాంతీయ పార్టీలేనని, ఇది అబద్ధ మని ఋజువు చేస్తే తాను రాజకీయాల నుండి శాశ్వతంగా తప్పుకుం టానని ఛాలెంజ్ చేశారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని, బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే దేశం విచ్చిన్నం అవుతుందని రాజీవ్‌గాంధీ అన్నారని గుర్తు చేశారు. కులగణన చేయబోమని బీజేపీ స్పష్టం చేసిందని, రెండు జాతీయ పార్టీలు బీసీలకు తీరని అన్యాయం చేశాయని ఆరోపించారు. 42శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ ప్రకారం ఎటువంటి లోటుపాట్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నిలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని లేదంటే బీసీల జనాభా ఎంత ఉంటే అంత వాటా ఇచ్చి ఎన్నికల్లోకి వెళ్లాలని డిమాండ్ చేశారు. కులం ఆధారంగా రాజ్యాంగ నిర్మాతలు కొన్ని రక్షణలు కల్పించారని, అంబేద్కర్ కృషి చేయకపోతే ఎస్సీ, ఎస్టీలకు ఎటువంటి ఫలాలు దక్కేవి కాదని గుర్తు చేశారు. బీసీలకు రాజ్యాంగ పరమైన రక్షణ కల్పించి ఉంటే అభివృద్ధిలో మనదేశం అమెరికాను దాటేసేదని అన్నారు. జనగణనలో భాగంగా కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా తెలంగాణలో కుల గణనలో కాకిలెక్కలు, దొంగలెక్కలు కాకుండా వాస్తవ లెక్కలు తీయాలని సూచించారు. మన ఉద్యమాల వల్లనే సావిత్రి బాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, మన ఉద్య మంతో జంగుపట్టిన ప్రభుత్వ రథ చక్రాలు కదులు తున్నాయని, బీసీలకు మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ధర్నా కార్యక్రమంలో శాసన మండలి మాజీ ఛైర్మన్ స్వామి గౌడ్, రజని సాయిచంద్, బీఆర్ఎస్ యువనేత ముఠా జై సింహ, వివిధ కుల సంఘాల నేతలు, ఒగ్గు కళాకారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ జాగృతి నేతలు పెద్దఎత్తున హాజరయ్యారు.

**పబ్లిక్ నోటీసు**

ఇందుమూలముగా ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా మన ట్రస్ట్‌లోని ట్రస్టీలందరూ ప్రస్తుతము వున్న ట్రస్ట్ యుగ తులసీ ఫౌండేషన్ యొక్క పేరును శ్రీ యుగ తులసీ ఫౌండేషన్‌గా మార్పు చేయవలెనని తేది: 02.01.2025వ తేదీన జరిగిన సమావేశము ద్వారా నిర్ణయించడం జరిగినది.

ఈ ట్రస్ట్ గతంలో మాదిరిగానే అదేవిధమైన దృక్పథంతో వ్యవహారాలను కొనసాగిస్తుంది. ఈ మార్పు నిమిత్తం అభ్యంతరాలు ఏమైనా వున్నచో వాటికి గల సహేతుకమైన కారణాలతో ఈ నోటీసు విడుదల చేసిన తేది నుండి ఏడు రోజులలోపు తెలియ పరచవచ్చును.

పేరు: కె.శైలజ. హోదా: సెక్రెటరీ,
ఈ-మెయిల్: yugathulasi@gmail.com
మొబైల్: 8008413413.
స్థలము : హైదరాబాద్, తేది: 02.01.2025

राष्ट्रीय डिज़ाइन संस्थान
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్
ఆంధ్ర ప్రదేశ్ • आंध्र प्रदेश • Andhra Pradesh

(భారత ప్రభుత్వ వాణిజ్య మరియు పరిశ్రమ మంత్రిత్వ శాఖ DPIIT అధీనంలోని జాతీయ ప్రాధాన్యత గల ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ)

ఉద్యోగ నియామక ప్రకటన నం. NID AP/RECT./2024/R-2 తేది: 05.12.2024

ది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, ఆంధ్రప్రదేశ్, భారత ప్రభుత్వ వాణిజ్య మరియు పరిశ్రమ మంత్రిత్వ శాఖ అంతర్గత వ్యాపారం మరియు పరిశ్రమ అభివృద్ధి విభాగం అధీనంలో స్థాపితమైన జాతీయ ప్రాధాన్యత గల స్వతంత్ర ప్రతిపత్తి గల మల్టీ-డిసిప్లినరీ డిజైన్ సంస్థ. ఈ క్రింది స్థానాల భర్తీ నిమిత్తం అర్హులైన భారతీయ పౌరుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.

| క్ర.సం. | ఉద్యోగం పేరు/సం./రిజర్వేషన్ | పే లెవెల్ | నియామక పద్ధ |
|---|---|---|---|
| 1 | హెడ్ లైబ్రేరియన్-01 సం.(UR) | 11 | ప్రత్యక్ష నియామకం విఫలమైతే డిప్యుటేషన్‌చే |
| 2 | సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్-01 సం.(UR) | 10 | ప్రత్యక్ష నియామకం విఫలమైతే డిప్యుటేషన్‌చే |

ప్రమాణ స్థాయి వికలాంగులైన వ్యక్తులకు అన్ని స్థానాలు అర్హత కలిగినట్టు గుర్తింపబడ్డాయి. ఆసక్తి మరియు అర్హత గల అభ్యర్థులు, ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్‌పై లింక్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్ దరఖాస్తు చేయవచ్చును. తదుపరి వివరాలు, అప్‌డేట్స్ మరియు మార్పులు ఏవైనా మా వెబ్‌సైట్ www.nid.ac.in/careersపై మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో ఈ ప్రకటన యొక్క ప్రచురణ తేదీ నుండి 30 రోజుల కొరకు ఆన్‌లైన్ దరఖాస్తు విండో తెరిచి ఉంచబడుతుంది.

CBC 05218/12/0005/2425

ఇన్-ఛార్జ్ అడ్మిన్ హెడ్
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ఆంధ్రప్రదేశ్

**స్కూటర్స్ ఇండియా లిమిటెడ్**
(ఒక భారత ప్రభుత్వ సంస్థ)
యొక్క రెసిడ్యుయల్ షేర్ హోల్డర్‌ల యొక్క గమనిక నిమిత్తం ఎగ్జిట్ ఆఫర్
కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్ : L25111UP1972GOI003599
నమోదిత కార్యాలయం : 3/481, 1వ అంతస్తు, వికల్పఖండ్
గోమ్టీ నగర్, లక్నో, ఉత్తర ప్రదేశ్, ఇండియా-226010: టెలిఫోన్ నం: 0522-3119593
వెబ్‌సైట్ : www.scootersindialimited.com, ఇ-మెయిల్ ID : csscootersindia@gmail.com

ఈ ఎగ్జిట్ ఆఫర్ బహిరంగ ప్రకటన ("ఎగ్జిట్ ఆఫర్ PA") జారీ చేయబడుతూ తెలియచేయునది ఏమనగా, స్కూటర్స్ ఇండియా లిమిటెడ్ ("కంపెనీ") BSE లిమిటెడ్ ("BSE") నుండి తనంతటానుగా డీలిస్టింగ్‌కు సంబంధించిన 2024, ఆగస్టు 17న మొదట్లో జారీచేసిన ప్రకటనకు కొనసాగింపుగా డీలిస్టింగ్ ఆఫర్ అనంతరం కూడా ఈక్విటీ షేర్లను కలిగి వుండి కొనసాగించే మరియు SEBI చే ("ఎగ్జిట్ విండో") చే జూన్ 20,2024 నుండి జూన్ 19, 2026వ లేదా అటువంటి మొదట్లోని తేదీ అనుమతి పొందిన, ఈక్విటీ షేర్ (ఎగ్జిట్ ధర) ఒక్కంటికి రూ.31.78/- యొక్క ఎగ్జిట్‌ధర వద్ద ఎక్వైరర్‌కు, వారి ఈక్విటీ షేర్లను ఇచ్చే కొర్కెగల మిగిలివున్న పబ్లిక్ షేర్ హోల్డర్‌లు ("రెసిడ్యుయల్ షేర్ హోల్డర్‌లు")కు ఇవ్వబడుతున్న ఎగ్జిట్ ఆఫర్ గురించి తెలియచేయడానికి ఇందుమూలముగా ప్రకటించబడమైనది. ఎగ్జిట్ దరఖాస్తు ఫారం ("ఎగ్జిట్ లెటర్ ఆఫ్ ఆఫర్")తో సహా ది ఎగ్జిట్ లెటర్ ఆఫ్ ఆఫర్, ఆగస్టు 17, 2024న రెసిడ్యుయల్ షేర్ హోల్డర్‌లకు పంపబడింది. మరియు రెసిడ్యుయల్ షేర్ హోల్డర్‌లకు నవంబర్ 16, 2024న రిమైండర్ నోటీస్ పంపబడింది. జనవరి 04, 2025న రెండవ రిమైండర్ నోటీస్ పంపబడుతోంది. ఎక్వైరర్ నుండి ఎగ్జిట్ దరఖాస్తు ఫారం స్వీకరించిన దానిలో సంబంధిత కేలండర్ నెల యొక్క ముగింపు నుండి పది పని రోజులలోపుగా ("నెలవారీ చెల్లింపు సైకిల్") నెలవారీ ప్రాతిపదికపై చెల్లింపు చేయవలసి వుంటుంది. కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.scootersindialimited.com వద్ద, రిజిస్ట్రార్ యొక్క వెబ్‌సైట్ www.skylinerta.com వద్ద మరియు ఆఫర్‌కు మేనేజర్ యొక్క వెబ్‌సైట్ www.corporateprofessionals.com కు లేదా క్రింద ఇవ్వబడిన లింక్ స్కాన్ వలన దయచేసి ఎగ్జిట్ దరఖాస్తు ఫారం ("ఎగ్జిట్ లెటర్ ఆఫ్ ఆఫర్")తో సహా ది ఎగ్జిట్ లెటర్ ఆఫ్ ఆఫర్, అందుబాటులో పొందవలసినదిగా ఇందుమూలముగా ప్రకటించబడమైనది లేదా క్రింది లింక్ స్కాన్ చేయండి.

(ఎగ్జిట్ లెటర్ ఆఫ్ ఆఫర్ చదవడానికి ఈ QR కోడ్‌ను దయచేసి స్కాన్ చేయండి)
(ఎగ్జిట్ దరఖాస్తు ఫారం చదవడానికి ఈ QR కోడ్‌ను దయచేసి స్కాన్ చేయండి)
(షేర్ ట్రాన్స్‌ఫర్ ఫారం చదవడానికి ఈ QR కోడ్‌ను దయచేసి స్కాన్ చేయండి)

ఎక్వైరర్ తరపున మరియు కొరకు
సం/- నవీన్ కౌల్
(అధీకృత సంతకందారులు)

ప్రదేశం : లక్నో
తేదీ : జనవరి 04, 2025

